ప్రజాశక్తి
మంగళవారం 29 ఏప్రిల్ 2025
5
విజయనగరం

వైద్యశాఖలో 91 పోస్టులకు నోటిఫికేషన్

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మలీల

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ మెడికల్ కాలేజి, సర్వజన ఆసుపత్రిలో 20 కేటగిరీలలో మొత్తం 91 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 5 కేటగిరీలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాలను ఆన్‌లైన్‌లో http://vizanagaram.ap.gov.in (or) http://vizianagaram.nic.inలో పొందు పర్చినట్లు తెలిపారు. నెట్వర్క్ అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఇఎంటి, స్టోర్ అటెండెంట్, ఆఫీస్ సబార్డినెట్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వచ్చేనెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌కు రాత పూర్వకంగా తెలియజేయాలని పేర్కొన్నారు.

టిడిపిలో ఉత్కంఠకు తెర

- నాగార్జునకు డిసిసిబి, గొంపకు డిసిఎంఎస్ చైర్మన్ పదవులతో సరిపెట్టిన అధిష్టానం
- ఊహలు తలకిందలయ్యాయంటున్న అనుయాయులు



గొంప క్రిష్ణ

కిమిడి నాగార్జున

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నామినేటెడ్ పదవుల కేటాయింపు విషయంలో టిడిపిలో నెలకున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూసిన సంగతి తెలిసిందే. వీరితోపాటు పార్టీ శ్రేణులు, ముఖ్యంగా వారి అనుయాయులు కూడా అసక్తిగా నిరీక్షించారు. ఎట్టకేలకు డిసిసిబి అధ్యక్షులుగా నాగార్జునను, డిఎంఎస్ చైర్మన్‌గా గొంపను నామినేట్ చేస్తూ సోమవారం టిడిపి అధిష్టానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఇద్దరిలో ఆయా పదవులు ఒకింత ఉత్సాహం, మరింత నిరుత్సాహం నింపాయని పార్టీ శ్రేణులనుంచి వినిపిస్తున్నాయి. కనీసం ఎమ్మెల్సీలు అవుతారని అంతా భావించామని, తీరా ఆ పదవులు ఇవ్వకపోయేసరికి, రాష్ట్ర స్థాయి చైర్మన్ పోస్టులైనా ఇస్తారనుకుంటే తీరా అత్యంత ఒడిదొడుకుల్లో నడుస్తున్న డిసిసిబి, డిసిఎంఎస్ పదవులతో సరిపెట్టేశారని చర్చిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్లు ఆశించి చీపురుపల్లి నుంచి నాగార్జున, ఎస్.కోట నుంచి గొంప, నెల్లిమర్ల నుంచి కర్రోతు బంగార్రాజు భంగపడిన సంగతి తెలిసిందే. వీరిలో బంగార్రాజుకు మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. అయితే ఆయనకు కూడా ఆ పదవి అంతగా రుచించలేదు. ఈ సంగతి కాస్త పక్కనబెడితే...

ముఖ్యంగా నాగార్జున ఎన్నికలకు ముందు నుంచీ జిల్లా పార్టీ బాధ్యతలు చూస్తూనే చీపురుపల్లిలో చురుకైన పాత్ర పోషించారు. నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా శక్తిమేర పనిచేయడంతో గత ఎన్నికల్లో సీటు ఆయనకు ఖాయం అనే వాతావరణం కూడా అప్పట్లో కనిపించింది. చివరకు చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు కోసం నాగార్జునను పక్కనబెట్టారు. అప్పట్లో తీవ్ర నిరాశ, మనస్థాపం చెందిన 'నాగార్జున యువత రాజకీయాల్లోకి రావొద్దు' అంటూ స్టేట్‌మెంట్లు కూడా ఇచ్చారు. ఆయనకు సీటు ఇవ్వాలంటూ చీపురుపల్లిలో భారీ ర్యాలీలు కూడా జరిగాయి. చివరకు పార్టీ నేత లోకేష్ జోక్యంతో నాగార్జున ఒక్క అడుగు వెనక్కితగ్గి పార్టీ అధ్యక్షునిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అటు ఎస్.కోట టిక్కెట్ ఆశించిన గొంప కృష్ణ సీటు దక్కకపోవడంతో ఏకంగా స్వతంత్రంగా పోటీచేసేందుకు కూడా సిద్ధం అయ్యారు. ఇందుకనుగుణంగా భారీ బహిరంగ సభసైతం నిర్వహించడంతో అధిష్టానం రంగంలోకి దిగి బుజ్జగించింది. అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామంటూ అధినేత చంద్రబాబు సహ లోకేష్ కూడా హామీ ఇచ్చారు. దీంతో, వెనక్కి తగ్గడమే కాకుండా విశాఖ ఎంపీ భరత్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలను బట్టి పార్టీ గెలుపునకు కృషి చేశారనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో వీరికి ఎమ్మెల్సీ పదవులు వస్తాయని తొలుత పార్టీ కేడర్ భావించింది. ఆ పదవులు వీరి వరకు రావని తేలడంతో కనీసం రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు వస్తాయని నాగార్జున, గొంపతోపాటు వారి అనుయాయులు కూడా ఆశించారు. తీరా, జిల్లా స్థాయిలో అదీ ప్రభుత్వమే పెద్దగా ప్రాధాన్యత ఇవ్వని డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్ పోస్టులతో సరిపెట్టడంతో ముఖ్యంగా నాగార్జున, గొంప పరిస్థితి కక్కలేక మింగలేక అన్న చందాన ఉంది.

వాస్తవానికి గతంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలే కో-ఆపరేటివ్ సొసైటీలను నిర్వీర్యం చేశాయి. కో-ఆపరేటివ్ సెక్టార్‌లోవున్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూత ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈ పూర్వపరాల్లో డిసిసిబి ఇప్పటికే తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. పాలకపార్టీలకు చెందిన నాయకులు రూ.కోట్ల రుణాలు తీసుకుని, వాటిని తీర్చేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇలాంటి మొండి బకాయిలను వసూలు చేసి, ఆ బ్యాంకును ప్రగతిపథంలో నడిపించడమంటే మాటలు కాదు. కొన్ని శాఖలు దివాలా తీసే పరిస్థితి వరకు వచ్చిందంటే ఆదిలోనే హంసపాదులా ప్రారంభంలోనే అపవాదులు ఎదుర్కోవాల్సి వస్తుందనడంలో సందేహం లేదు. డిసిఎంఎస్ కూడా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. మొత్తం మార్కెటింగ్ వ్యవస్థనే బడా వ్యాపారులకు అనుగుణంగా మార్చేసిన తరుణంలో డిసిఎంఎస్‌ల మనుగడే కష్టతరంగా మారింది. రైతు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక ధాన్యం కొనుగోలు, యూరియా, డిఎపి వంటి ఎరువుల విక్రయాలకు కూడా దూరమైంది. ప్రస్తుతం ఐసిడిఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ స్కూళ్లకు ఆహార పొట్లాలను మార్కెటింగ్ చేస్తూ నెట్టుకొస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో డిసిసిబి అధ్యక్షపదవిగానీ, డిసిఎంఎస్ చైర్మన్ పదవిగానీ వారి పార్టీ పదవులకన్నా పెద్దవేమీ కాదనే చర్చ పార్టీ శ్రేణుల్లోను, వారి అనుయాయుల్లోనూ నడుస్తోంది. ఈ నేపథ్యంలో నాగార్జున, గొంప అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



వంటావార్పు నిర్వహిస్తున్న సిపిఎం నేత తమ్మినేని, గిరిజనులు

కొండ, గూడు వదులుకోం

ఎర్ర జెండా నీడలో ఉంటాం ● తెగేసి చెప్పిన మారిక గిరిజనులు

సిపిఎం జెండాతో ధర్నాలో పాల్గొన్న చిన్నారులు

'తాతల కాలం నుంచీ ఈడే ఉన్నాం. గవర్నమెంట్ ఏదొచ్చినా ఏనాడూ మాకు సదుపాయాలీయ లేదు. ఎలాగోలా కొండపై ఆధారపడి బతుకీడుస్తుంటే.., ఏదో అదానీ కంపెనీనంట. దాని కోసం మా భూములు, కొండ, గూడు, బడిని లాక్కొంటారట. మమ్మల్నీడనుంచి ఎల్లగొడతారట. ప్రాణం పోయినా పర్లే! ఈడ నుంచెల్లేదు లేదు. కొండ, గూడు వదులుకోం. ఎర్ర జెండా నీడలోనే ఉంటూ పోరాడతాం."

- ఇదీ మారిక గిరిజనుల గర్జన. మారిక కొండ, భూములు, ఊరి జోలికొస్తే ఊరుకునేది లేదని ముక్తకంఠంతో హెచ్చరించారు.

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని మారిక గ్రామంలో అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం భూసేకరణకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. అదానీ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు పోరుబాట పట్టారు. గిరిజనులు పిల్లలతో సహా కదిలొచ్చారు. మండల కేంద్రమైన వేపాడలో సోమవారం ర్యాలీ చేపట్టి, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడే వంటా వార్పు చేశారు. కార్పొరేట్ కంపెనీ కోసం పచ్చని పొలాలు, కొండను లాక్కొంటూ, గిరిజనుల జీవితాలతో చెలగాటమాడుతుంటే చూస్తూ ఊరుకోబోమని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మారిక గిరిజనులకు అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అదానీ కంపెనీని మారికలో అడుగు పెట్టనీయబోమని తెగేసి చెప్పారు. గిరిజనుల ఆందోళనకు ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం సంఘీభావం ప్రకటించాయి. ఎంపిపి డి.సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు గిరిజనుల ఆందోళన వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.

30న జాబ్‌మేళా

విజయనగరంటౌన్ : నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 30న ఉదయం 10 గంటలకు మహిళా ప్రాంగణం వద్ద గల ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. భారత్ బయోటెక్ , హీరో మోటో కార్స్, మెడ్ ప్లస్ ఫార్మసీ , డెక్కన్ ఫైన్ కెమికల్స్, గెలాక్షి హెల్త్ ఇన్సూరెన్సు తదితర 8 కంపెనీలలో 705 ఉద్యోగాలకు ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా www.ncs.gov.in website, job seeker loginలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎంపిడిఒలకు పోస్టింగ్ ఉత్తర్వులు

విజయనగరం టౌన్ : జిల్లాలో మండల పరిషత్ అధికారులుగా ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ తన ఛాంబర్‌లో ఉత్తర్వులు అందజేశారు. ఇటీవల విస్తరణ అధికారులకు ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి లభించింది. వారికి మండలాల్లో ఎంపిడిఒలుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. విజయనగరంలో ఎఒగా పనిచేస్తున్న జి.వెంకటరావును సీతానగరం ఎంపిడిఒగా, అక్కడ ఎఒగా ఉన్న ఎంఎల్ఎం ప్రసాద్‌ను పాచిపెంట ఎంపిడిఒగా నియమించారు. ప్రస్తుతం గుమ్మలక్ష్మిపురం ఇఒపిఆర్‌డి కె.ధర్మా రావుకు జియ్యమ్మవలస ఎంపిడిఒగా నియమించారు. కార్యక్రమంలో సిఇఒ బి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాల నుంచి తొలగిస్తే

ఆత్మహత్యలే శరణ్యం

పురుగుల మందు డబ్బాలతో విద్యుత్తు ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి -చీపురుపల్లి

పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

తమను ఉద్యోగాల నుండి తొలగిస్తే కుటుంబాలతో వీధిన పడి బతకలేక ఆత్మహత్యలే శరణ్యమని మండలంలోని పుర్రాయవలస గ్రామ పరిధిలోగల 33 కెవి సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లు సోమవారం పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. పుర్రాయవలస వద్ద స్థానిక ప్రజలు ఇచ్చిన స్థలంలో 33 కెవి సబ్ స్టేషన్‌ను నిర్మాణం చేశారు. అయితే అందులో పని చేసేందుకు షిఫ్ట్ ఆపరేటర్లను 2024 మార్చి నెలలో నియమించారు. అప్పటి నుండి జీతాలు చెల్లించకుండా సంబంధిత అధికారులు తమ జీవితాలతో ఆటలాడుకోవడమే కాకుండా తాజాగా తమని విధుల నుండి తొలగిస్తామని అనడం ఏమిటని వారు ప్రశ్నించారు. సంబంధిత అధికారులు తమ బతుకులతో ఆటలాడుకుంటున్నారంటూ సదరు ఉద్యోగులు ఎస్.సురేష్ కుమార్, ఆర్.సతీష్, ఎం.బాలాజీ, పి. సూర్యనారాయణ ఆందోళనకు దిగడంతో సబ్‌స్టేషన్ పరిధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం తెలుసుకున్న వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు భరోసాగా నిలిచారు. సంబంధిత ఉన్నతాధికారులను సంఘటన స్థలానికి రప్పించి ఇరువర్గాల మధ్య చర్చలు జరపడంతో సమస్య సద్దు మణిగింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

ఎపిఇపిడిసిఎల్ పరిధిలో పుర్రాయవలస వద్ద 33 కెవి సబ్ స్టేషన్‌లో విశాఖపట్నంకు చెందిన సాయి మణికంఠ అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్టు ఉద్యోగులుగా ఈ నలుగురు నియమితులయ్యారు. సదరు నలుగురు విధులు నిర్వహిస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గతేడాది కాలంగా వీరికి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలతో తామెలా జీవించాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. తమ సమస్యలపై జిల్లా కార్మిక అధికారులకు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోయారు. తమకు జీతాలు చెల్లించకుండా వేధిస్తుండడంతో పాటు ఉద్యోగాల నుంచి కూడా తొలగిస్తామంటూ సోమవారం ఎపిఇపిడిసిఎల్‌కు చెందిన విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ వద్దకు రావడంతో షిఫ్ట్ ఆపరేటర్లు పురుగుల మందుల డబ్బాలతో తాము ఆత్మహత్యలు చేసుకుంటామని అధికారులు ఎదుటే ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. దీంతో వైసిపి నాయకులు అనంతం, వరహాల నాయుడులతో పాటు అక్కడున్న కొంతమంది స్థానికులు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డా షిఫ్ట్ ఆపరేటర్లని నిలువరించారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సబ్ స్టేషన్ వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని వైసిపి నాయకులు ఉన్నతాధికారులకు చెప్పి వారిని రప్పించారు. ఏడి రమణ, ఎఇ సూర్య ప్రభాకర్, తదితరులు కార్మికుల వినతులను స్వీకరించి ఉన్న అధికారులకు నివేదికను సమర్పించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు మద్దతుగా రామలింగాపురం, పుర్రెయవలస ప్రజలు నిలిచారు.

అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ

నేడు బొబ్బిలిలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ పదవిపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై టిడిపి కౌన్సిలర్లు, వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం ప్రత్యేక సమావేశం జరగనుంది. అవిశ్వాస తీర్మానం నెగ్గుతామని టిడిపి, తీర్మానం వీగుతుందని వైసిపి నేతలు.. ఇలా ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తుకు పై ఎత్తులు

మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గేందుకు టిడిపి, ఓడించేందుకే వైసిపి నాయకులు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా 20 వార్డులలో వైసిపి, 10 వార్డులలో టిడిపి, ఒక వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ వి.వనజకుమారి వైసిపిలో చేరడంతో ఆ సంఖ్య 21కు చేరింది. వైసిపి కౌన్సిలర్ ఒకరు రాజీనామా చేయడంతో ప్రస్తుతం మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 20 మంది వైసిపి కౌన్సిలర్లలో 10 మంది కౌన్సిలర్లు టిడిపికి మద్దతు ప్రకటించారు. దీంతో వైసిపి బలం 10కి తగ్గింది. అవిశ్వాస తీర్మాన సమావేశం జరగాలంటే 20 మంది కౌన్సిలర్లు హాజరు కావాలి. ఒకరు తగ్గినా కోరం లేక సమావేశం వాయిదా పడనుంది. ఒక్కసారి సమావేశం వాయిదా పడితే ఏడాది వరకు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదు. దీంతో సమావేశానికి కోరం సభ్యులు హాజరు కాకుండా చూసేందుకు వైసిపి చూస్తోంది. పూర్తి స్థాయి సభ్యులతో సమావేశానికి వెళ్లి అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గేందుకు టిడిపి నాయకులు ప్రణాళికలు వేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగే అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సమావేశ ఏర్పాట్లను ఎన్నికల అధికారి రామ్మోహనరావు సోమవారం పరిశీలించారు. సమావేశం సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

వైసిపి కౌన్సిలర్లకు విప్ జారీ

వైసిపి కౌన్సిలర్లకు జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విప్ జారీ చేశారు. మంగళవారం అవిశ్వాస తీర్మానంపై మున్సిపల్ ప్రత్యేక సమావేశం జరగనుండడంతో వైసిపికి అనుకూలంగా ఓటు వేయాలని ఆ పార్టీ కౌన్సిలర్లకు సోమవారం విప్ జారీ చేశారు. విప్ ప్రతులను ఎన్నికల అధికారి రామ్మోహనరావుకు వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, నాయకులు అందించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

శిబిరంలోకి టిడిపి కౌన్సిలర్లు

అవిశ్వాస తీర్మానాన్ని ఎలాగైనా ఓడించాలని లక్ష్యంతో వైసిపి నాయకులు ప్లాన్ వేసి, టిడిపి కౌన్సిలర్లకు గాలం వేసేందుకు సిద్ధమయ్యారు. టిడిపికి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లను బయటకు తెచ్చి తమ వైపు తిప్పుకొనేందుకు వైసిపి నాయకులు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో టిడిపి కౌన్సిలర్లతో మంతనాలు సాగించి, ఒకరినైనా తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలు టిడిపి నాయకులకు తెలియడంతో 10 మంది పార్టీ కౌన్సిలర్లను ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక శిబిరానికి తరలించారు. దీంతో నేడు అవిశ్వాస తీర్మానం సమావేశంలో ఏమి జరుగుతుందోనని ప్రజలు, రాజకీయ నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కూటమి వచ్చాక రాజకీయ వ్యభిచారం — మాజీ ఎమ్మెల్యే శంబంగి

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ వ్యభిచారం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత రాజకీయాలు దిగజారి పోయాయని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి 95 శాతం విజయం సాధిస్తే, కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి చైర్మన్ సీట్లను లాక్కునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడం సరికాదన్నారు. వైసిపి కౌన్సిలర్లకు విప్ జారీ చేశామని, తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తే కౌన్సిలర్ పదవి పోవడం ఖాయమని హెచ్చరించారు.

భారీవర్షంతో శృంగవరపుకోటలో రోడ్డుపై చేరిన నీరు

పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లాలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. శృంగవరపుకోటలో వర్షానికి మురుగు కాలువల్లో నీరు ఉప్పొంగి రోడ్లపై ప్రవహించింది. శృంగవరపుకోట పట్టణంలో ఈదురు గాలులకు ఫ్లెక్సీలు నేలకొరిగాయి. చాలాచోట్ల మామిడికాయలు నేలరాలాయి. మరికొన్నిచోట్ల అరటి తోటలు నేలకొరిగాయి. అకాలవర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలో రోడ్లపై నీరు చేరడంతో పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

వంగర : మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఎం.సీతారాంపురం, తలగాం, శివ్వాం, వంగర, ఓని అగ్రహారం, తదితర గ్రామాలలో కురిసిన వర్షానికి వీధుల్లో వర్షపు నీరు చేరి జలమయమయ్యాయి. వివిధ గ్రామాలలో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై నీరు ప్రవహించి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సంతకవిటి: మండలంలోని సంతకవిటి, తలాడ, మందరాడ, కొండగూడెం, ఎం.ఆర్ అగ్రహారం తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

- 'మత్స్యకారుల సేవ'లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- రూ.7.59 కోట్లు ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

మత్స్యకారులకు చెక్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మాధవి, అదితి, కలెక్టర్

రాష్ట్రంలోని మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. దీనిలో భాగంగానే వేట నిషేధకాలంలో అందజేసే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు రెట్టింపుచేసి ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రారంభించిన మత్స్యకారుల సేవలో కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 3,796 మంది తీరప్రాంత మత్స్యకారులకు వేటనిషేధ కాల భృతి కింద ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున రూ.7.59 కోట్ల మొత్తానికి సంబంధించిన చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, పూసపాటి అదితి గజపతి, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తదితరులు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1,29,718 మంది మత్స్యకారులకు వేటవిరామ భృతి కింద రూ.259 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. మత్స్యకారులు చేపలవేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నామని, వేటకు వెళ్లే మత్స్యకారుల బోట్లకు లీటరుపై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. మత్స్యకారుల కోసం రాష్ట్రంలో 10 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 5 ఫిషింగ్ హార్బర్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. మత్స్యకార మహిళలతో వీడ్ కల్చర్ ద్వారా చేపపిల్లల ఉత్పత్తిని ప్రోత్సహిస్తామన్నారు. ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ మత్స్యకారులు దూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నిరోధించేందుకు ఈ ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రిని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు గల సాంకేతిక అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు మండలాల పరిధిలోని 19 గ్రామాల్లో చేపలవేట జీవనాధారంగా 4 వేల మంది వరకు జీవిస్తున్నారని చెప్పారు. వీరిలో అర్హులైన 3,796 మందిని గుర్తించి వేట నిషేధకాల భృతి అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రతిఏటా 5 వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి అవుతోందని, దీనిని రెట్టింపు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చినప్పన్న, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయకృష్ణ, మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

గడువులోపే వినతులకు పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశం
- పిజిఆర్ఎస్ కు 188 వినతులు

విజయనగరం కోట : ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 188 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ , జేసి సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 188 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 80 వినతులు ఉన్నాయి. పింఛన్ల కోసం డిఆర్‌డిఎకు 30 వరకు వినతులొచ్చాయి.

సమయపాలన పాటించాలి

ప్రభుత్వ కార్యాలయాలకు హాజరయ్యే అధికారులు సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ సమయాలలో కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటు లో ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 10.45 గంటలకు అన్ని కార్యాలయాల హాజరు పట్టీ ని ఫోటో తీసి డిఆర్ఒకు పెట్టాలని, ఆలస్యం అయిన వారికీ సిఎల్ మార్క్ చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగు నీటి సమస్య తెలెత్తకుండా చూడాలని ఎంపిడిఒలకు, ఇఒపిఆర్‌డిలకు కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రాల్లో చలి వెంద్రాలను ఏర్పాటు చేయాలనీ తహసిల్దార్లకు సూచించారు.

అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

మాత, శిశు ఆరోగ్యంపైనే దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

మాత, శిశు ఆరోగ్యంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని స్త్రీ, ప్రసూతి, పిల్లల వైద్య నిపుణులు రోహిత్ కుమార్, మేరీ అగస్టిన్ అన్నారు. సోమవారం బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మాత, శిశు ఆరోగ్య సంరక్షణ మాసోత్సవాల్లో భాగంగా ఇందిరమ్మ కాలనీలోని ఏకీకృత ఆరోగ్య కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పోషణ, సంరక్షణపై అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షులు సింధిరి శ్రీనివాస్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోటరీ జిల్లా అధ్యక్షులు జె సి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి, డాక్టర్ సాయికుమార్, సూపర్‌వైజర్లు అరుణకుమారి, నిర్మల, రోటరీ ప్రతినిధులు శివ కాంత్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

1 నుంచి బ్యాడ్మింటన్ శిక్షణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో మే ఒకటో తేదీ నుంచి వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏటా 150 మంది చిన్నారులను భావి భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తయారు చేస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు క్రీడ దుస్తులను, పౌష్టికాహారం గుడ్డు, పాలు, నిమ్మరసం, గ్లూకోస్ అందిస్తామని, ఇవన్నీ మిత్రులు సహాయ సహకారాలతో చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారం అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ఆర్‌టిసి డిపో సిబ్బందితో కలిసి ఆర్‌టిఒ ఎం.ఉష సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలను తనిఖీ చేసి పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు జరిమానాలు విధించారు. 115 ఆటోలను తనిఖీ చేయగా, 11 ఆటోలకు జరిమానాలు వేశారు. ఎనిమిది ఆటోలను తగిన పత్రాలు లేని కారణంగా సీజ్ చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్నామని ఆర్‌టిఒ అన్నారు. రూ.1.20 లక్షలు జరిమానాలు విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్, డిపో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

రెండు కుటుంబాలను ఎమ్మెల్యే లోకం మాధవి రూ.10 లక్షలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నారు. ఇటీవల రెండు నెలల కిందట మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థలో పని చేస్తున్న బీల రంగోలి, అదపాక శివ గణేష్ ఇద్దరు ఒకే బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఇందులో రంగోలి అక్కడికక్కడే మృతి చెందగా, శివ గణేష్ తీవ్ర గాయాలు పాలై చికిత్స పొందుతూ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వీరి పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సిఇఒ లోకం ప్రసాద్ ఆర్థిక సహాయం అందజేశారు. కోనాడ గ్రామానికి చెందిన శివగణేష్‌కు రూ.6లక్షలు, మృతి చెందిన రంగోలి కుటుంబానికి రూ.4లక్షలు చెక్కును అందజేశారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బర్గపురంలో మండల పరిషత్ నిధులు సుమారు రెండు లక్షల రూపాయలతో సోమవారం సిసి రోడ్డు నిర్మాణానికి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి శంకుస్థాపన చేశారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇందుకూరి రామరాజు, సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, సుంకరి బుల్లి, కాంగ్రెస్ శంకర్, ఆడారిఅప్పారావు, సత్తిబాబురావు, ఆదిబాబు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి

విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కోటలో ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఉపకేంద్రాలలో బిఎస్‌సి నర్సింగ్ పట్టభద్రులను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించారని తెలిపారు. ఆరేళ్లుగా ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత లేకుండా పోయిందని చెప్పారు. జీతభత్యాలు సకాలంలో చెల్లించడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. సిహెచ్ఒల వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం

ప్రజాశక్తి-వేపాడ

మండల సమాఖ్య కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. వీలుపర్తి యూనిట్ పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను ప్రతి సోమవారం విక్రయించనున్నారని ఎపిఎం సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వీలుపర్తి యూనిట్ ఇన్‌ఛార్జి రాము, ఐడిపి అవతారం, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-మెంటాడ

విద్యార్థుల్లో మానసిక వికాసానికి క్రీడలు ఎంత దోహదపడతాయని ఆంధ్ర ఎస్ఐ కె.సీతారాం వెల్లడించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలు, చిత్రలేఖనం, చేతిరాత, యోగా, మెడిటేషన్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. సెలవుల్లో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు వెంకటరమణను ఆయన అభినందించారు.

బావి ఆక్రమణను తొలగించాలని వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని మునసబు వీధి శివారు ప్రాంతంలో మోపాడ వారి కళ్లం వద్దనున్న సాగునీటి బావి ఆక్రమణను తొలగించాలని రైతులు సోమవారం డిప్యూటీ తహశీల్దార్ మూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. గత కొన్నేళ్లుగా 11 సెంట్ల భూమిలో ఏర్పాటు చేసిన బావి ద్వారా వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. ఆ బావిని కప్పేసి నూతి చుట్టుపక్కల ఉన్న రైతులు ఆ భూమిని స్వాధీన పరుచుకోవాలని చూస్తున్నారని వివరించారు. బావిని యథావిధిగా ఉంచాలని కోరారు. వినతిపై డిటి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మోపాడ కృష్ణ, మోపాడ అప్పలనాయుడు, ఎం.చిన్నికృష్ణ, మోపాడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై కొరడా : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది సోమవారం అయ్యన్నపేటలోని ప్రణాళికా లేని నిర్మాణాలను తొలగించారు. అయ్యన్నపేటలోని రెండు చోట్ల అనుమతులు లేకుండా స్లాబ్ వేసి, ఇతర నిర్మాణాలను చేపట్టారని గుర్తించిన కమిషనర్ పల్లి నల్లనయ్య వాటిని తక్షణమే తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించారు. దీంతో ఆరోజు వాటిని తొలగించి అక్కడ నుండి డబ్రిస్ ను కూడా తొలగించారు. ఈ సందర్భంగా, అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ సహించబోమని కమిషనర్ చెప్పారు.

విసినిగిరిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లిలో భూకబ్జాలకు పాల్పడుతున్న జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని విజయనగరం గ్రీవెన్స్ సెల్ లో జాయింట్ కలెక్టర్ కు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కు చీపురుపల్లి మండలం వైసిపి నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ అధికారికి, మండల తహశీల్దారుకు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ విసినిగిరి శ్రీనివాస్ పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. శ్రీనివాసరావు కూటమి ప్రభుత్వం అండదండలతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనేక భూ కబ్జాలకు పాల్పడ్డాడని, అతనిపై చర్య తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి నాయకులు కొనిరెడ్డి రమణ, గవిడి సురేష్, రెడ్డి గోవి, కరణం ఆదినారాయణ, దబ్బాడ ఆనంద్, పండు, సత్యం, వెంకీతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

బాగా చదవాలి.. మంచిపేరు తేవాలి

టెన్త్‌లో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థులతో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు తమ దృష్టంతా చదువుపై కేంద్రీకరించి భవిష్యత్తులోనూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై తమ తల్లిదండ్రులకు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలెక్టర్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సత్కరించారు. ఇంటర్ తదితరపై తరగతుల్లోనూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, తమను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు రుణపడి ఉండాలన్నారు. పలువురు బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బలంగా ఆరోగ్యంగా వున్నపుడే లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి వారు ఏయే వృత్తుల్లో వున్నదీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా టాపర్‌గా నిలిచిన గర్భాం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి సంగరెడ్డి వివేక్ తాను కంప్యూటర్ ఇంజనీర్ అవుతానని తెలిపాడు. ఒక విద్యార్థి తాను సివిల్స్ సాధించాలని భావిస్తున్నట్టు చెప్పగా, పలువురు తాము ఇంజినీరింగ్‌లో చేరుతామని వివరించారు. విద్యార్థులకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం రచించిన ఒక విజేత ఆత్మకథ, డాక్టర్ బి.వి.పట్టాభిరాం రచించిన కష్టపడి చదవొద్దు - ఇష్టపడి చదవండి పుస్తకాలను బహూకరించారు. విద్యార్థులు సంగారెడ్డి వివేక్(జెడ్‌పి హైస్కూల్, గర్భాం), కొయ్య హరీష్(ఎ.పి.మోడల్ స్కూల్, భోగాపురం), లావేటి మెహర్ రేష్మ(బి.సి.సంక్షేమ గురుకులం), చోడవరపు శివ (బి.సి.సంక్షేమ గురుకులం, కారాడ), పెదిరెడ్ల భాగ్యశ్రీ(జెడ్పీ హైసస్కూల్, కొట్యాడ), శంబంగి కలవల లక్ష్మి (జెడ్‌పి హైస్కూల్, పక్కి), తాడేల రేవంత్(జెడ్‌పి హైస్కూల్, భైరిపురం), సెనేటి మోహన్(బి.సి.సంక్షేమ గురుకులం, కారాడ), పైల యశోద(జెడ్‌పి హైస్కూల్, జిన్నాం)లను సత్కరించారు. కె.జి.బి.వి.పాఠశాలల్లో 580కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సత్కరించారు. శతశాతం పైగా ఉత్తీర్ణత సాధించిన జామి, వంగర, గజపతినగరం, ఎల్.కోట కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాల్‌లను అభినందించారు. కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సబ్‌జైలును తనిఖీ చేస్తున్న డిసిఎల్ఎ కార్యదర్శి లక్ష్మికుమారి

సబ్‌జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భబిత ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బిహెచ్‌వి లక్ష్మి కుమారి సోమవారం విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించినారు. ఖైదీల పట్ల సిబ్బంది విపక్షత చూపిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జైలులో సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.

జిందాల్ పరిశ్రమను తెరవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ యాజమాన్యం పరిశ్రమను అర్థాంతరంగా నిలిపేయడం తగదని, బేషరతుగా తిప్పి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం జిందాల్ పరిశ్రమ గేటు ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సూర్యనారాయణ మాట్లాడుతూ పరిశ్రమకు జిందాల్ యాజమాన్యం హఠాత్తుగా లాకౌట్ ప్రకటించి కార్మికులను రోడ్డు మీద పడేయడం అన్యాయమన్నారు. గత సంవత్సరం కూడా ఇదే పద్ధతిలో ముడిసరుకు లేదని కారణం చూపించి, రెండు నెలలకు పైగా కంపెనీని మూసివేశారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కంపెనీని నమ్ముకుని 320 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ముడి సరుకు లేదని కారణం చూపించి ప్రభుత్వం అనుమతి కోరకుండా, కార్మిక సంఘాలకు తెలియజేయకుండా అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను ఇబ్బందికి గురిచేయడం అన్యాయమన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి ముడిసరుకు తెప్పించి కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, సిఐటియు నాయకులు నమ్మి చినబాబు, ఈశ్వరరావు, టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, కార్మికులు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జొన్నవలస హైస్కూలులో 17 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న దుర్గాదేవి సేవా సంఘం సభ్యులను తొలగిస్తూ తహశీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని , బకాయి బిల్లులు గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ దశాబ్దాలుగా మధ్యాహ్న భోజన పథకాలలో పనిచేస్తూ పిల్లలకు వండి పెడుతున్న వంటమ్మలపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడడం, తొలగించడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాణ్యతలేని బియ్యాన్ని సివిల్ సప్లై ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తే అన్నం ఉడకలేదని, ముద్దయిందని కారణాలతో జొన్నవలస హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథక కార్మికులను తొలగించడం అన్యాయం అన్నారు. అప్పులు చేసి పిల్లలకు అన్నం పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులపై కక్ష సాధింపులు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పెద్దలు పునరాలోచన చేసి రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్వప్న, రాజేశ్వరీ, నాగమణి ,హేమ ,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమ్యాయి. ఈ సందర్భంగా స్థానిక హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణ ఈ వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముందుగా సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాల వేసి అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేశ్ విద్యార్థులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట** : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఇఒ లక్ష్మి ప్రారంభించారు. శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్, ఉపాధ్యాయులు పి.కాశీవిశ్వనాథ్, ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, కవి కటకం పావని పాల్గొన్నారు. **రామభద్రపురం** : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను పూడివీధి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రఘురాంనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యవాణి పాల్గొన్నారు. **తెర్లాం** : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎంఇఒ ఆర్.అప్పారావు ప్రారంభించారు. విశ్రాంత ఎంఇఒ ఎం.సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు. **విజయనగరం కోట** :గాజులరేగ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తెలుగు యువత అధ్యక్షుడు బి.రామునాయుడు, గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ నారాయణరావు ప్రారంభించారు.

సమస్యల పరిష్కారానికి సిహెచ్‌ఒల సమ్మె

మద్దతు తెలిపిన ఎపి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ చైర్మన్ కాంతారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎపి సిఎంఎ ఆధ్వర్యాన నిరవధిక సమ్మెకు దిగారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాచేశారు. వైద్య ఆరోగ్యశాఖ లోని ఎంహెచ్ఎం కింద సిహెచ్‌ఒలుగా పని చేస్తున్న గత రెండేళ్లగా జీతభాత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆరేళ్ల దాటిన సిహెచ్‌ఒలను క్రమంబద్ధికరించాలని, ఎంహెచ్ ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతినెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తామని అసోసియేషన్ సభ్యులు పి.తెజేస్వని, కె.మౌనిక, పరిమళ, విజయలక్ష్మి, హరీష్, కనకదుర్గ తెలిపారు. ఉద్యోగుకు చేస్తున్న పోరాటానికి ఎపి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు మద్దతు తెలిపారు. న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామన్నారు. సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న బి.కాంతారావు

ఆనందంతో స్వీట్లు తినిపించుకుంటున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

నాగార్జున గ్రూపులో ఆనందోత్సవాలు

ప్రజాశక్తి -చీపురుపల్లి

రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టులను టిడిపి అధిష్టానం భర్తీ చేసిన నేపథ్యంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జునకు డిసిసిబి చైర్మన్ పదవిని అప్పగించారు. దీంతో చీపురుపల్లి ప్రాంతంలో నాగార్జున గ్రూపులో ఆనందోత్సవాలు నెలకొన్నాయి. తెలుగుదేశం పార్టీకి ఎన్నికల ముందు నుండి తన వంతు సేవలను అందిస్తున్న నాగార్జున అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెటు ఆశించినప్పటికీ దక్కకపోవడంతో ఆయన గ్రూపు వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ తన కేడర్‌ను చెక్కు చెదరనివ్వకుండా పార్టీ గెలుపు కోసం ఆయన కృషి చేశారు. ఎన్నికల పర్యటనలోనే నాగార్జున భవిష్యత్తుకు తాను భరోసాగా నిలుస్తానని అప్పట్లోనే చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతో ఆయన అనుచరులంతా కలిసికట్టుగా పనిచేసి కళా వెంకటరావును గెలిపించారు. ఈ నేపథ్యంఓ నాగార్జునకు సముచిత స్థానం కల్పించడంతో టిడిపి శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం

ప్రజాశక్తి-బొబ్బిలి

లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం మే డే ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లతో కనీస వేతనాలు, సమ్మె హక్కు కోల్పోతారన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత చట్టాలను అమలు చేయాలని కోరుతూ మే 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్, వాసు, గౌరి పాల్గొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన అంగన్వాడీల సమావేశంలో పి.శంకరరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీలు భాగస్వామ్యం కావాలని కోరారు.

తెర్లాం: సమ్మె బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలని పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ కోరారు. స్థానిక పట్టణ కళాసీ సంఘం కార్యాలయంలో మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అధ్యక్షులు బి.అప్పల స్వామి, వై.అప్పారావు, కళాసీలు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని కొరటాం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యాన లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా అంగన్వాడీలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మండల నాయకులు ఎస్.గోపాల్ మాట్లాడుతూ మే 20న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

విజయనగరంటౌన్ : అంగన్వాడీ వర్కర్లను ,హెల్పర్లను కార్మికులుగా గుర్తించని 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమ్మె ఒప్పంద జీవోలు అమలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై మే 20న చేపట్టే సమ్మెను జయప్రదంచేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు విశాలాక్షి, ప్రభ పిలుపునిచ్చారు. విజయనగరం అర్బన్ పరిధిలో పూల్ బాగ్ , గాజులరేగ, కనపాక, ఐసిడిఎస్ ఆఫీసుల వద్ద ఏర్పాటు చేసిన సెక్టార్ మీటింగ్‌ల్లో సమ్మెకు సంబంధించిన బుక్ లెట్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

మహిళల ఆర్థిక స్వావలంబన కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం కొత్తవలసలో బిసి కార్పొరేషన్, ఇడబ్ల్యుఎస్ ముస్త కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 90 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 140 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జి రత్నాజీ, తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను హతమార్చిన కుమారుడు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆస్తి కోసం తల్లిదండ్రులను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన విషయాలను సోమవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు.

పూసపాటిరేగ మండలం చల్లవానితోట గ్రామ పరిధిలో ఈనెల 26న తల్లిదండ్రులను హతమార్చిన పాండ్రంకి రాజశేఖర్‌ను సోమవారం ఉదయం చోడమ్మ అగ్రహారం గ్రామ జంక్షన్ వద్ద భోగాపురం సిఐ జి.రామకృష్ణ అరెస్టు చేశారు. పాండ్రంకి అప్పలనాయుడు, పాండ్రంకి జయమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రాధ కుమారిని ఆనందపురం మండలం నేలతేరు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. వివాహ సమయంలో అప్పలనాయుడు వారి కుమార్తె పేరున 20 సెంట్లు భూమిని రాసి ఇవ్వగా, ఇంకనూ 70 సెంట్లు భూమి వారి పేరున ఉంది. కుమారుడు పాండ్రంకి రాజశేఖర్ కు ఊరిలో రూ.12లక్షలు వరకు అప్పులు ఉండగా, వాటిని తీర్చేందుకు ఆ భూమిని అమ్ముదామని తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. ఈ విషయమై గ్రామ పెద్దలు వద్ద పంచాయితీ పెట్టగా, సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి, తరుచూ గొడవలు పడుతుండేవి. కుటుంబంలో వచ్చిన విభేదాలు కారణంగా పాండ్రంకి రాజశేఖర్ గత ఏడాది ఆక్టోబరులో తల్లిదండ్రులతో విడిపోయి, భార్య, కుమార్తెతో కలసి, రెల్లివలస వెళ్ళిపోయి వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల నిందితుడు పాండ్రంకి రాజశేఖర్ రైతు భరోసా కోసం సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు సంప్రదించగా, భూమికి సంబంధించిన పాస్ బుక్కులు తీసుకొని రావాలని సూచించారు. రాజశేఖర్ మీసేవలో కాపీలు తీయగా, తన తండ్రి పేరున ఉండాల్సిన 70సెంట్లుకు బదులు 40 సెంట్లు మాత్రమే ఉన్నట్లు, మిగిలిన 30సెంట్లు భూమి డిసెంబరు 2024లో తన సోదరి గంగిరెడ్డుల రాధ కుమారి పేరున రిజిస్ట్రేషను చేసినట్లుగా గుర్తించాడు.

ఈ విషయమై తల్లిదండ్రులను ప్రశ్నించగా, దానికి వారు స్పందించక పోవడంతో, గ్రామ పెద్దలు సమక్షంలో మరోసారి పంచాయతీ జరిగింది. అయితే, తన సోదరి పేరున వ్రాసిన భూమిని చదును చేస్తే, సమస్య పరిష్కారం అవుతందని భావించిన రాజశేఖర్ ఈనెల 26న ట్రాక్టరుతో కొంత మట్టిని రోడ్డు నుండి పొలంకు వెళ్ళే దారిలో వేసి, చదును చేసేందుకు జెసిబి పెట్టినట్లుగా తల్లిదండ్రులకు తెలిసి, పాండ్రంకి రాజశేఖర్ గొడవపడ్డారు. ఇరువురి మధ్య తగువు జరగడంతో జెసిబి డ్రైవరు చదును చెయ్యకుండా అక్కడ నుండి వెళ్ళిపోగా, కోపోద్రేకుడైన రాజశేఖర్ దగ్గరలోని నడుపూరు కల్లంలోగల తన ట్రాక్టరును తీసుకొచ్చి తల్లిదండ్రులను గుద్దేందుకు ప్రయత్నించగా, వారు భయంతో ప్రక్కనే ఉన్న రంగమ్మగారి మొక్కజొన్న చేనులో దాక్కున్నారు. వారిని చంపాలనే దురుద్దేశంతో మొక్కజొన్న చేనులో ట్రాక్టరును రెండు మూడు సార్లు త్రిప్పి, చేనులో దాక్కున్న తల్లిదండ్రులపై నుండి ట్రాక్టరు పోనివ్వడంతో వారు మరణించారు. సోదరి రాధకుమారి ఫిర్యాదుమేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో భోగాపురం సిఐ జి.రామకృష్ణ, పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-విజయనగరంకోట

1వ పట్టణ పోలీసు స్టేషన్లో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం పట్టణం చైతన్య నగర్‌కు చెందిన నాలం శివకుమార్ (29)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి సహజ మరణం పొందేంత వరకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. విజయనగరానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అత్యాచారం చేసి, గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బహిరంగ ప్రకటన

విజయనగరం, గాజులరేగలో సర్వే నెంబరు 79/8 (న్యూ) 22/4 (ఓల్డ్) 345 చ.గ విస్తీర్ణం గల ఖాళీ నివేశనస్థలం విజయనగరం బస్తీ వాస్తవ్యులు వంకాయల వెంకటరాజు గారి కుమారుడు రామలింగేశ్వరరావు గారి వద్ద నుండి, విజయనగరం బస్తీ వాస్తవ్యులు గోకవరపు లేటు నరయ్య గారి కుమారుడు పైడిశెట్టి తే:17.2.2005ది డాక్యుమెంటు నెంబరు 1362/2005, విజయనగరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, రిజిష్టరు కాబడినది. ఈ క్రయచీటి ఇంటి నుండి, విజయనగరం పిడబ్ల్యు మార్కెట్టుకు వెళ్లే మార్గ మధ్యలో పడిపోయినది. కావున సదరు క్రయచీటి ఎవరికైనా దొరికిన ఎడల వారం రోజులు లోగా ఈ క్రింది న్యాయవాది గార్కి, అందజేయగలరు, అందుకు తగిన పారితోషకము ఇవ్వబడను.

అల్లాడ హరీష్,
న్యాయవాది, విజయనగరం
సెల్ : 9849944618

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి
EA 11/2024 EP 5/14 FDIA 142/09
OS 173/04

Perla Krishna Rao and others
......Petitioners
VS
Bommi Konda Babu and others
....Respondents

To
R1. Bommi Konda Babu S/o late Adinarayana, R/o 13-3-50, Addepalli Vari Veedhi, At Present R.K. Enclove, Bhagavan Nagar, Vizianagaram.
R2. Bommi Parvathi w/o Konda Babu, Rest do

పై పిటిషనర్స్ పై నెంబరు గల EA 11/24 in EP 5/14 పై కోర్టులో దాఖలు చేసియుంటిరి. సదరు పిటిషన్‌లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిన అందక పోవుటచే ఇందు మూలంగా నోటీసు తెలపడం జరిగినది. కావున సదరు పిటిషన్ **తే॥ 2-5-2025ది ఉ॥ 10-30 గం॥లకు** మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు తగు నిర్ణయించుదురు.

P.V.Ganesh
Advocate for Petitioners,
Vizianagaram